1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com

జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలో సాయి సంస్కృతికి తృతీయ స్థానం


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన వడ్డేవార్ సాయి సంస్కృతి జాతీయ స్థాయి అబాకస్ పరీక్షలో తృతీయ స్థానం సాధించినట్లు న్యూ ఆదర్శ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీలలో సాయి సంస్కృతి ఉత్తమ మార్కులు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో మూడవ స్థానం సాధించిన సాయి సంస్కృతిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్యం, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

చిత్తుబొత్తు ఆడుతున్న ఆరుగురిపై కేసు



నవతెలంగాణ-కామారెడ్డి

చిత్తుబొత్తు ఆడుతున్న ఆరుగురిపై స్పెషల్ టాస్క్ ఫోర్స్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామం శివారులోని ఆరుగు చిత్తుబొత్తు ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఆ స్థావరంపైన దాడి చేసి వారిని పట్టుకొని, మొత్తం నగదు ఆరువేల నగదు, 6 బైక్‌లు, 6 సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్టు తెలిపారు. చిత్తుబొత్తు అడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా స్పెషల్ టాస్క్ ఫోర్స్ వారికి జిల్లా ఎస్పీ సింధుశర్మ అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాలు పడితే వారి సమాచారాన్ని 100 డయల్ గాని సంబంధిత అధికారులకు తెలియజేయాలనీ, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రయివేటు ఆస్పత్రిలో గర్భిణి మృతి

- వైద్యులు నిరక్ష్యంగా వ్యవహరించారని బంధువుల ఆందోళన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రయివేటు ఆస్పత్రిలో నాలుగు నెలల గర్భిణి మృతిచెందింది. కాగా వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతిచెందిందని ఆరోపిస్తూ కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రిలో మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. కాలూర్ గ్రామానికి చెందిన కంఠం స్రవంతి(35) రెండో సారి గర్భం దాల్చడంతో నగరంలోని కీర్తిసాయి ప్రసూతి ఆస్పత్రిలో నెలవారీ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. కాగా మూడో నెలలో స్కానింగ్ చేయగా.. లోపల ఉన్న శిశువుకి శ్వాస, హార్ట్‌బీట్ సక్రమంగా లేవని, అందుకు అబార్షన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. అబార్షన్‌కు మందులు వాడితే సరిపోతుందని మందులు రాసి ఇచ్చారు. దీంతో బాధితులు మందులను తీసుకొని ఇంటికి వెళ్లారు. మందు గోలీలను ఇంటికి వెళ్ళిన తరువాత వేసుకోగా.. రక్తస్రావం కావడంతో, ఆసుపత్రి వైద్యులను ఫోన్‌లో సంప్రదించగా ఎటువంటి ఇబ్బంది లేదు అని అబార్షన్ పూర్తి అవుతుందని సలహా ఇచ్చారు. రక్తస్రావం తగ్గకపోవడంతో గర్భిణీని ఆదివారం తీసుకువచ్చారు. అప్పటికి గర్భిణీ పరిస్థితి విషమంగా మారడంతో వేరే ఆస్పత్రికి తీసుకెళ్లండని సదరు కీర్తిసాయి ఆస్పత్రి యాజమాన్యం పంపించడంతో మరో ప్రయివేటు ఆస్పత్రిని సంప్రదించారు. కాగా అప్పటికే గర్భిణి మృతి చెందిందని తెలపడంతో బాధితులు కీర్తిసాయి ఆస్పత్రికి వచ్చి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వచ్చి రాని వైద్యం చేసి గర్భిణి మృతికి కారణమయ్యారని వాపోయారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆస్పత్రి నుంచి కదలబోమని అక్కడే మృతదేహంతో బైటాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఆస్పత్రి యాజమాన్యం సూచించి ఆందోళన విరమించాలని విన్నవించడంతో వారు శాంతించారు.

పార్లమెంట్ ప్రచారానికి

స్థానిక నేతలు దూరం

- ప్రచార వానాలకే ప్రాధాన్యత
- స్థానిక నేతలను మరచిన అభ్యర్థులు
- ఓటు బదిలీ జరిగేనా?

రెండు, మూడు గ్రూపులు

బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలకు అంతగా క్యాడర్ లేకున్నా ఉన్న కొద్దిపాటి నాయకుల్లో రెండు, మూడు గ్రూపులుండడం గమనార్హం. దీంతో ఏ గ్రూపును దగ్గర తీస్తే ఏ గ్రూపు దూరం అవుతుందనే భయంతో పోటీ చేసే అభ్యర్థులు సతమతమవుతున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలో రెండు మూడు గ్రూపులున్నాయని నేతలే చెప్పుకొస్తున్నారు.



నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రధాన పార్టీల మండల స్థాయి నాయకులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలను వివరించడంలో స్థానిక నేతల్లో స్పందన కరువైంది. లోక్‌సభ ఎన్నికలలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అభ్యర్థులు బాన్సువాడ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గ్రామాల్లో ఉన్న స్థానిక నేతలను మర్చిపోవడంతో స్థానిక నేతలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో వివిధ పార్టీల అభ్యర్థులు తక్కువ చేసి చూస్తున్నారని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బాన్సువాడ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి నాయకులు క్యూ కట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీని వీడిన వారు సైతం మళ్లీ సొంతగూటికి చేరుతున్నారు. తిరిగి వచ్చిన నేతలు, పార్టీ మారిన వలస నేతలు అంతా తమదే పెత్తనం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరికొందరు బీఆర్ఎస్ నుంచి బీజేపీ బాట పట్టిన వారూ ఉన్నారు. బాన్సువాడ ,బీర్కూర్ నసురుల్లాబాద్ మండల్లోలాల్లో వలస వచ్చిన నేతలతో లోక్‌సభ ఎన్నికల్లో ఎంతవరకు ప్రయోజనం చేకూరుతుందనే చర్చ పార్టీలో మొదలైంది.

ఆగని వలసలు

బాన్సువాడ నియోజకవర్గాల్లో వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. లోక్‌సభ ప్రచారం ఊపందుకునే సమయంలో వలసలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత వరుసగా సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలు ఉండడంతోనే తమ రాజకీయ భవిష్యత్ కోసం అధికార పార్టీలో చేరుతున్నట్లు తెలుస్తోంది. కొత్తగా చేరుతున్న నేతలతో పార్లమెంట్ అభ్యర్థులకు ఎంతవరకు కలిసి వస్తుందనే మాట ఎలా ఉన్నా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకున్న బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వలస నేతలతో ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న వారు తమ ప్రాధాన్యం తగ్గిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పార్టీలు మారి వచ్చిన వారు మళ్లీ పెత్తనం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో పార్టీలో విభేదాలు కొని తెచ్చినట్లుగా భావిస్తున్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామమాత్రపు ప్రచారం చేస్తున్నారు.

వలస నేతలతో ఓటర్లు మారేనా?

బాన్సువాడ బీర్కూర్ నస్రుల్లాబాద్ మండలాల్లో వలస రాజకీయా లు జోరుగా సాగుతున్నా ఓటర్ల తీరు మాత్రం అంతు చిక్కడం లేదు. తామ మారినంత మాత్రానా ఓటర్లు మారుతారా అనే సందిగ్ధం నెల కొంది. ప్రధానంగా బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులు కాంగ్రెస్, బీజే పీ వైపు మొగ్గు చూపుతున్నారు. పార్టీలు మారుతున్న నాయకుల వెంట పదుల సంఖ్యలో కూడా అనుచరులు ఉండకపోవడం గమనార్హం. ప్రస్తుతం వలసల నేపథ్యంలో ఓటర్లు ఏ మేరకు మారుతారు? ఏ పార్టీకి లాభం చేకూరుతుందనే చర్చ జోరుగా సాగుతోంది.

మతోన్మాద బిజెపిని ఓడించి

దేశాన్ని కాపాడుకుందాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బుర్రి ప్రసాద్


మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

మతోన్మాద బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బుర్రి ప్రసాద్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత పది సంవత్సరాలుగా బిజెపి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకురావడం వలన వందలాది మంది రైతులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటాలను చేసి అనేకమంది ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చడం కోసం కార్మిక చట్టాల్లో మార్పులు తెచ్చి కార్మిక హక్కులను కాలరాసారని, ప్రజా సొమ్ముతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రైవేట్ కంపెనీలో రిజర్వేషన్లు అమలు జరపకుండా పేద మధ్యతరగతి ప్రజానీకం ఉపాధి అవకాశాలు తగ్గి పేదరికంలో నెట్టివేయబడ్డట్టు తెలిపారు.

అనంతరం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయని, వీటన్నిటి ఫలితంగా ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ప్రజల దృష్టిని మరల్చటానికి మతవైశ్యమ్యాలను ప్రేరేపిస్తూ ప్రసంగించడంతోపాటు ప్రజల్లో విద్వేషాలను పెంచి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డా రు. ప్రజలకు ఉన్న హక్కులను కాలరాసే పద్ధతుల్లో రాజ్యాంగాన్ని మార్చి లౌకిక ప్రజాస్వామ్యానికే నష్టం చేకూర్చే పని చేయాలను కుంటున్నారని అన్నారు. తమను ప్రశ్నించిన వాళ్లపైన కేసుల పేరుతో అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. అందుకే ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడం కోసం లౌకిక ప్రజాస్వా మ్యాన్ని పునరుద్ధరించుకోవడానికి రాజ్యాంగాన్ని నిలబెట్టుకోవడం కోసం బిజెపిని ఓడించాలని కోరారు. ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు తెలపాలని బిజెపి అరాచకాలను ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్, పెద్ది వెంకట్ రాములు, వెంకటేష్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, జంగం గంగాధర్, నన్నే సాబ్, కొండ గంగాధర్, విగ్నేష్, నాయకు లు సిర్ప లింగం, రాములు, నరసయ్య, అనసూయమ్మ, భూమ న్న, నాయక్ వాడి శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన కార్యకర్తలు, నాయకులు

స్వేచ్ఛాయుత ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా అధికారులతో ఎన్నికల పరిశీలకులు
- అంతకుముందు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సుహృద్భావ వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ లోక్ సభ ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌మీనా సూచించారు. ఆదివారం జిల్లాకు వచ్చిన రాజేశ్ మీనాను కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు, అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్‌లు, జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద విస్తృత వాహన తనకీలు, ఎఫ్ఏస్‌టి, ఎస్ఎస్‌టి బృందాల ద్వారా నిర్వహిస్తున్న తనఖీ, పట్టుబడిన నగదు, పోలీసు, అబ్కారీ శాఖల ఆధ్వర్యంలో మద్యం, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న మద్యం, నమోదు చేసిన కేసుల వివరాలను వారికి వివరించారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, లొకేషన్‌లలో తీసుకుంటున్న పోలీసు బందోబస్తు వివరాలు వెల్లడించారు.

ఎస్పీ సింధుశర్మ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు కాపాడడానికి, ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడడానికి పటిష్ఠ పోలీస్ భద్రత తనిఖీలు ప్రతిరోజు నిర్వహించడం జరుగుతున్నదని పరిశీలకుల దృష్టికి తెచ్చారు. ఓటర్లను ప్రలోభపర్చే చర్యలను నిరోధించేందుకు జిల్లా సరిహద్దులలో రెండు అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, నెలకొల్పి నిరంతరం తనిఖీలు చేస్తున్నామని ఇవే కాకుండా అంతర్ జిల్లా చెక్ పోస్టుల ద్వారా కూడా ప్రతి వాహనం తనిఖీ చేస్తున్నామని వివరించారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించి సరిహద్దు ప్రాంతం నుంచి అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు రాకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. స్థానిక పోలీసు సిబ్బందితో పాటు ఒక కంపెనీ పారామిలిటరీ బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయని సమస్యాత్మక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహింపజేశామని వివరించారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలను నిశితంగా పరిశీలిస్తూ, సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ జరుపుతున్నామని, నియమావళిని అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు పాత నేరస్థులు, రౌడీషీట్ కలిగి ఉన్న 493 మందిని బైండోవర్ చేశామని, లైసెన్సులు కలిగి ఉన్న వ్యక్తుల వద్ద నుండి 19 ఆయుధాలను డిపాజిట్ చేయించామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి, కామారెడ్డి డిఎస్పి నాగేశ్వరరావు, టౌన్ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సిఐ రామన్, తదితరులు మర్యాదపూర్వకంగా పోలీస్ అబ్జర్వర్‌నీ కలిశారు.

తూకం వేసిన ధాన్యం

సకాలంలో రైస్‌మిల్లుకు చేర్చాలి

- ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి
- జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లిఖార్జునబాబు


ధాన్యంను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన వెంటనే ధాన్యం సకాలంలో రైస్‌మిల్లులకు తరలించాలని చెప్పారు. ఆదివారం సదాశివ నగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి లో కొనసాగుతున్న పలు కొనుగోలు కేంద్రాలను, సదాశివ నగర్ లోని పద్మావతి ఇండస్ట్రీస్ బాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పుంజుకున్నదని ఇప్పటివరకు ఒక లక్ష 20వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. కేంద్రం నిర్వాహకులు నాణ్యత ప్రమాణాల మేరకు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి తూకం వేసిన వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. ట్యాబ్ ఎంట్రీలు త్వరితగతిన పూర్తిచేసి నిర్దిష్ట గడువులోగా రైతులకు డబ్బు అందించాలని సూచించారు. వడగాల్పులు వీస్తున్న వేళ రైతులకు నీడ, మంచినీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. టోకెన్ వారిగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులు సంయమనం పాటించాలని, వృద్ధ రైతులు ధాన్యం కుప్పల వద్ద ఉండవద్దని విజ్ఞప్తి చేశారు. సీఎంఆర్ రైసును మరాడించి నిర్దిష్ట గడువులోగా భారత ఆహార సంస్థకు అందజేయాలని రైస్ మిల్ యజమానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల ఉప తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

విద్వేషం కావాలా?

మానవహితం కావాలా?

- భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్


మాట్లాడుతున్న భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

విద్వేషానికి, మానవహితానికి మధ్య జరుగుతున్న పోరే 18వ పార్లమెంటు ఎన్నికలు అని భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక న్యూ అంబేద్కర్ భవనంలో ఆదివారం "పార్లమెంటు ఎన్నికలు- ఓటర్ల బాధ్యత" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా హాజరైన యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకమైన పవనాలు వీస్తున్నాయని, వారు ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాలలో కూడా ఓటర్ల నాడిని చూస్తే సగానికి పైగా సీట్లలో ఇండియా కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే తెలంగాణ ఓటర్లు ఒక నియంతను తొలగించుకున్నారని, ఇంకొక నియంతకు బుద్ధి చెప్పే దానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ దేశ ప్రజలకి బిజెపి అసలు రంగు అర్థమైందని వారు మరోసారి వస్తే రాజ్యాంగాన్ని దేశ ప్రజాస్వామ్యాన్ని తొలగించి మత విద్వేషాలతో కూడిన సొంత రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టబోతున్నారని అందుకోసమే వారిని పక్కన పెట్టాలని ప్రజలందరూ నిర్ణయించుకున్నారని అన్నారు.

నిజామాబాదులో కూడా ఇండియా కూటమి అభ్యర్థి గెలవబోతున్నాడు అని దానికోసం కార్యకర్తలు ప్రజాస్వామ్య సంఘాల ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి వాస్తవాలు ఏమిటి? అబద్ధాలు ఏమిటి? తెలియచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్ జాతీయ నాయకులు కిరణ్, ప్రొఫెసర్ సుకుమార్, నర్ర రామారావు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, షేక్ హుస్సేన్ కో కన్వీనర్, కే రామ్మోహన్రావు మల్లు స్వరాజ్యం ట్రస్టు కన్వీనర్, భాస్కర్, నరసింహులు డాక్టర్ రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయమైంది

- భారీ మెజార్టీ కోసమే ప్రచారం : ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు ఖాయమైందని, భారీ మేజార్టీ కోసమే ప్రచారం, బైక్ ర్యాలీలు, రోడ్ షో లు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ పోచారం గ్రామం నుంచి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ప్రారంభించారు. పోచారం మీదుగా వదలపర్తి, మాల్ తుమ్మెద, గోలి లింగాల్, చినూరు, వాడి గ్రామాల మీదుగా మండల కేంద్రం నుంచి బంజారా లింగంపల్లి, బొల్లారం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో పల కాంగ్రెస్ ప్రచారం నిర్వహిస్తే విశేష స్పందన వస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు డు శ్రీధర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వాసురెడ్డి, విట్టల్‌రెడ్డి, పర్వత్రావు, షాహిద్ పాష, ఠాగూర్, దివిటీ కిష్టయ్య, ఇమామ్, విక్రమ్, గులాం హుస్సేన్, సాయగౌడ్, సుధాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత


బీమా చెక్కు అందజేస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన పార్దే పోశెట్టి మృతి చెందగా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా మంజూరైన రూ.9,04,845 ప్రమాద బీమా చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఇటీవల పోశెట్టి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మికి బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యమాగంటి లింగాగౌడ్, పట్టణ అధ్యక్షుడు సాగర్ యాదవ్, మేనేజర్ గుజరాతి మోహన్, అడ్వైజర్ అంజయ్య, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

హున్సలో కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

సాలురా మండలంలోని హున్సా గ్రామంలో ఆదివారం సాలూర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి ఎన్నికల ప్రచారం చేశారు. ఎం.పీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కరపత్రం ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మందర్నా రవి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు రావుల లక్ష్మణ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు పల్లె గంగారాం, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఖాజాపూర్ అశోక్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మురిగే శంకర్, మాజీ ఎంపీటీసీ చీల శంకర్, మార్కల్ శివ కుమార్, దేవదానం, జోజయ్య, గడ్డం శీను, చీల ప్రకాష్, ఈరాయప్ప మహారాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


సహస్ర (ఫైల్)

నవతెలంగాణ-ఎడపల్లి

యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని జానకంపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంగలి సహస్ర (19) అనే యువతి ఈనెల 27న ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు ఆమె అన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు బీజేపీని ఓడించండి


మాట్లాడుతున్న మల్లేష్

నవతెలంగాణ-బోధన్

ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఫాసిస్ట్ బిజెపిని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. ఆదివారం సాలూర మండలంలోని ఖాజాపూర్, తగ్గెల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచార సమావేశాలను నిర్వహించి మాట్లాడారు. సాలూర మండల కేంద్రంలో ఖాజాపూర్, తగ్గెల్లి తదితర గ్రామాలలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజా పంథా) పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార సమావేశాలను నిర్వహించినట్టు తెలిపారు. 2014, 2019లో జరిగిన ఎన్నికలలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నిత్యావసర సరుకుల ధరలను తగ్గిస్తామని, జన్‌ధన్ ఖాతాలలో 15 లక్షలు వేస్తామని అనేక వాగ్దానాలను, చెప్పిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. జీఎస్టి పేరుతో ప్రజలపై ఆర్థిక భారం మోపారని అన్నారు. మరోవైపు బడా కార్పోరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలను అందిస్తున్న బిజెపి పార్టీని ఓడించాలన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రజల మధ్య మతాల పేరుతో వైషమ్యాలు సృష్టిస్తుందన్నారు. అందుకే ఈసారి జరిగే ఈ పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, సి.హెచ్.గంగయ్య బి.మారుతి, ఎంపీ గంగారామ్, లచ్చారాం, లక్ష్మీబాయి, సరుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటు హక్కుపై ఛాయాచిత్ర ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ఈ నెల 29 నుంచి మే 01 వరకు ఛాయాచిత్ర పదర్శన ఏర్పాట్లు చేసినట్లు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ టిఎస్ఆర్టిసి బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఈ ప్రదర్శనను ఈ నెల 29న ఉదయం 10:30 గంటలకు ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, ఐ.ఏ.ఎస్ (2005 బ్యాచ్), పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఐపిఎస్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్.కిరణ్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ టిఎస్ ఆర్టిసి ఆర్ఎం జానీరెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి సురేష్ కుమార్, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సందర్భంగా తొలిసారిగా ఓటు వేయబోతున్న యువతకు ఎన్నికల మొబైల్ యాప్‌ల వినియోగం, అవినీతికి తావులేని ఓటు హక్కు వినియోగం, ఎన్నికల చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శన ఉంటుందని తెలిపారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారు, ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

138వ మేడేను జయప్రదం చేయండి

- ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

138వ మేడేను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్.భవన్ కోటగల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు తమ హక్కులను సాధించుకున్న రోజు మేడే అన్నారు. 138 సంవత్సరాల క్రితం అమెరికా దేశంలో చికాగో నగరంలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా వెట్టీ చాకిరికి వ్యతిరేకంగా, 8 గంటల పని కోసం కార్మిక వర్గం మహత్తర పోరాటం చేసిందన్నారు. ఆ పోరాటాల ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు 8 గంటల పనిదినం అమలైందన్నారు. కానీ నరేంద్రమోడీ ప్రభుత్వం 8గంటల పనిదినాన్ని రద్దుచేసి, 12 గంటల పని నిబంధనను తీసుకొచ్చిందన్నారు. కార్మికులు సాధించుకున్న మొత్తం 44 చట్టాలను రద్దుచేసి, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి, కార్మికులను బానిసత్వంలోకి తీసుకొస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కానీ కార్మికులకు కనీస వేతనాలు అందించడంలో పాలకవర్గాలు తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. 8 గంటల పనివిధానం కోసం, కార్మికుల హక్కుల కోసం, కనీస వేతనాలు అమలు కోసం, మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని, జిల్లావ్యాప్తంగా కార్మిక లోకం మేడేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శులు బి.మల్లేష్, ఆర్.రమేష్, జిల్లా నాయకులు డి.కిషన్, మురళి, సాయరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కలగానే లేదర్ పార్కు నిర్మాణం

- ఎన్నికల హామీగానే మిగిలిపోతుందా..?

నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నికలు వస్తున్నాయి.. పోతున్నాయి.. ప్రచారం చేసేటప్పుడు హామీగా.. గెలిచిన తర్వాత దాని ఊసే మర్చిపోయే నాయకుల వాగ్దానాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2003 ఆగస్టు 20న పట్టణ శివారులోని జిరాయిత్‌నగర్ యానం గుట్ట సమీపంలో లేదర్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఇందుకోసం ఇక్కడ సుమారుగా 28 ఎకరాలు కేటాయించారు. ఒక షెడ్డును మాత్రమే నిర్మించి వదిలేశారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం.. ఆ తర్వాత అప్పటి స్థానిక ప్రజాప్రతినిధులు హామీలకే పరిమితం అయినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వాలు మారినా ఇక్కడి చర్మకారుల పరిస్థితి మారలేదు. పరిశ్రమలు పూర్తయితే సుమారుగా పదివేల మందికి పైగా ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఉపాధి లభిస్తుంది. లోక్‌సభ ఎన్నికల ప్రచార అభ్యర్థులు లేదర్ పార్కును ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం మారడంతో..

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు తెలంగాణకు చెందిన 10 జిల్లాల్లో లేదర్ పార్కులు ఏర్పాటు చేస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ లేదర్ పార్కుకు సంబంధించి రెండుసార్లు కేంద్రం నుంచి తన వాటా కింద 80శాతం నిధులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన 20 శాతం ఇవ్వకపోవడంతో వచ్చిన డబ్బులు వెనక్కి వెళ్ళిపోయాయి. కాగా అప్పట్లో కొంతమందిని ఎంపిక చేసి శిక్షణ ఉపాధి నిమిత్తం చెన్నై, హైదరాబాద్ పంపించారు. ఇక్కడ అందుకు సంబంధించిన కుట్టు మిషన్లు తీసుకొచ్చారు. శిక్షణ పొందిన వారితో మరికొంతమందికి శిక్షణను ఇచ్చారు. అయితే పరిశ్రమ ప్రారంభానికి నోచుకోకపోవడంతో వారు ఇతర పనులు చేసుకుంటున్నారు.

రెండు వేల కుటుంబాలకు పైగా...

నియోజకవర్గంలో సుమారుగా 2000 కుటుంబాలు ఉన్నట్లు మోచి సంఘం ప్రతినిధులు చెబుతున్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర కుల వృత్తిదారులను ప్రోత్సహిస్తున్నట్లు తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా లేదర్ పార్కును ప్రారంభించి మోచీలను, మాదిగలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉంది. ఇక్కడి వృత్తిదారులు కుటుంబాలకు పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కార్మికులుగా ఇతరత్రా పనులు చేసుకుంటున్నారు. కాగా పార్కు స్థలం కబ్జా కాకుండా అధికారులు హద్దు వెంబడి ప్రహరీని సైతం నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని నిర్మిస్తున్నారు. సంవత్సరం లోపు ఆ భవనం పూర్తి చేయాల్సి ఉంది.



గత ప్రభుత్వాలు విఫలం



పరిశ్రమలను తెరిపించడంలో గత ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ప్రస్తుతం పార్లమెంట్ అభ్యర్థులు సైతం లేదర్ పార్కును అందుబాటులోకి తెస్తే అనేక మందికి లబ్ధి చేకూరుతుంది. ఇందుకు స్థానిక నాయకులు చొరవ తీసుకోవాలి.

\- మైలారం బాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆర్మూర్.

మతతత్వ బీజేపీని ఓడించండి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్, కట్టా రమ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజా సమస్యలను గాలికొదిలి, మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్, కట్టా రమ అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అధ్యక్షత వహించగా.. ముఖ్య వక్తలుగా వచ్చిన సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్, కట్ట రమ మాట్లాడుతూ.. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తుందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై ఐటి, ఈడి, సీబీఐలను ప్రయోగించి భయానకాన్ని సృష్టిస్తున్నదన్నారు. అవినీతి పేరుతో భయపెట్టి తన పార్టీలో చేర్చుకుంటుందని తెలిపారు. లేదంటే ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, మంత్రులపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. బీజేపీ చట్టబద్ధంగా అవినీతిని ప్రోత్సహిస్తూ, ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో వేలకోట్ల ముడుపులను సమకూర్చుకున్నదని ఆరోపించారు. మణిపూర్‌లో సంవత్సర కాలంగా మత విద్వేష మంటలు చెలరేగి 200 మందికి పైగా ప్రజలు హత్యలకు గురైనా, ప్రధాని స్పందించలేదన్నారు. అదానీ, అంబానీలకు మొత్తం దేశాన్ని, దేశ సంపదను అప్పగిస్తున్నారని విమర్శించారు. 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తూ వికసిత భారత్ అనడం సిగ్గుచేటన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు మళ్లీ మూడవసారి ఎన్నికల్లో గెలిస్తే దేశంలో ఇక కనీస ప్రజాస్వామ్యం, హక్కులు లేకుండా పోతాయన్నారు. మతాల ఎజెండా చుట్టే పాలనసాగి, ప్రజల అవసరాలు కనుమరుగు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎన్డీఏ శక్తులను ఓడించాలని, అందుకోసం పార్టీ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్, రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు దేవారం, వెంకన్న, రాజేశ్వర్, ముత్తన్న, మల్లేష్, సురేష్, సుధాకర్, సాయగౌడ్, సత్తెక్క, గంగాధర్, మురళి, కిషన్, రమేష్, కిషన్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో బోనాల ఊరేగింపు


దప్పులతో బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఆదివారం స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గ్రామంలోని గౌడ సంఘం మహిళలు ఇంటికో బోనం తరలివచ్చి పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో గ్రామం నుంచి శ్రీగిరి క్షేత్రం సమీపంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు కొనసాగింది. బోనాలతో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకున్న మహిళలు అమ్మవారికి బోనం నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.


ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతు

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మాట్లాడుతున్న నాయకులు

పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలోని కోటగల్లి నీలం రామచంద్ర భవన్‌లో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు మాట్లాడుతూ.. బిజెపి గత పది సంవత్సరాల కాలంలో ప్రజలు చెమటోర్చి సంపాదించిన డబ్బును జీఎస్టి పేరుతో పన్నుల రూపంలో వచ్చిన సంపదను కొద్దిమంది పెట్టుబడిదారులకు కట్టబెడుతూ, బడా పెట్టుబడిదారులకు వేలకోట్ల రూపాయలు బ్యాంకుల్లో అప్పులు రద్దు చేశారని విమర్శించారు. ప్రభుత్వ సెక్టార్‌కు సంబంధించిన సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని, ప్రైవేటీకరణలో రిజర్వేషన్లు రద్దు అవుతాయని కిందిస్థాయి ప్రజలకు ఉద్యోగ అవకాశాల్లేకుండా పోతాయని అన్నారు. పార్లమెంట్‌లో 400ల సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో బిజెపి ప్రభుత్వం ఉందని, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని చూస్తుందని అన్నారు. స్వాతంత్ర సమర యోధులకు, ఇతర వ్యక్తులకు మతం రంగు పుస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగిపోయాయని, కావున పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ బలపరుస్తుందని వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు యం.శివకుమార్, జెల్ల మురళి, మోహన్, శంకర్, ఏళ్ళప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

- రోటరీ క్లబ్ అధ్యక్షులు గోపి కృష్ణ పట్వారి



ఐడీ కార్డులను అందజేస్తున్న పిడి జి.హనుమంత్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు గోపి కృష్ణ పట్వారి అన్నారు. ఆదివారం పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో విద్యా వెలుగు అనే కార్యక్రమాన్ని స్థానిక విద్య హైస్కూల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రస్తుతం జరిగే పోటీ పరీక్షలు కోసం చదువుతున్న అభ్యర్థుల కోసం ఈ విద్యా హైస్కూల్లో చదువుకోవడానికి అవకాశం ఏప్రిల్ 28 నుంచి మే 30 వరకు గల అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని, చక్కగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. గౌరవ అతిథి పి.డి.జి హనుమంతరెడ్డి విద్యార్థులకు ఐడీ కార్డుని అందజేశారు. ఈ అవకాశాన్ని ఆర్మూర్, చుట్టుపక్క ఉన్న గ్రామాల్లోని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు చైర్మన్ ప్రవీణ్ పవార్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ పద్మ, మురళి, మాజీ అధ్యక్షులు పుష్కర్ రావు, కాంతి గంగారెడ్డి, సురేష్, సభ్యులు గోనే దామోదర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా మురికి కాలువల నిర్మాణం

- పట్టించుకునే వారే లేరు
- నాసిరకం మెటీరియల్‌తో నిర్మించిన మురికి కాలువ

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఎరాజ్‌పల్లి గ్రామంలో రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న మురికి కాలువను కాంట్రాక్టర్ నాసిరకం మెటీరీయల్ వినియోగించి పనులు చేపడుతున్నా రు. కంకర, డస్ట్, నాణ్యమైన ఇసుక వాడవలసి ఉన్నప్పటికీ.. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మాత్రం మట్టిలాంటి ఇసుక కలిపి ఉన్న కంకర డస్ట్ వాడుతూ మురికి కాలువ నిర్మాణం చేపడుతు న్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విష యంపై రోడ్డు భవనాల శాఖ అధికారిని వివరణ కోరగా పనులు నాణ్యతగా చేపట్టవలసిన బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌దేనని తెలిపారు. రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో ఇరువైపులా మురికి కాలువలు నిర్మిస్తున్నారు. కానీ ఈ పనుల ను పట్టించుకునే వారు లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్ పనులను నాసిరకం మెటీరీయల్‌తో చేపడుతున్నారు. పది కాలాలపాటు మన్నికగా ఉండవలసిన ఈ మురికి కాలువ లక్షలు వెచ్చించి నిర్మిస్తున్నారు. నాసీరకంగా కండ్లముందే పనులు జరుగుతున్నా పట్టించుకు నే వారే లేరు. నిర్మించిన మురికి కాలువలకు నామమాత్రంగా క్యూరింగ్ చేస్తున్నారని దాంతో ఎండాకాలంలో అవి పగుళ్ల వచ్చే అవకాశం ఉంద ని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నాసిరకం పనులపై చర్యలు తీసుకో వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


మురికి కాలువ నిర్మాణంలో నాసిరకం పనులు


నాసిరకం ఇసుక

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో పరిసర ప్రాంతాల్లో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ముఖ్య అనుచరులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వారి వాహనాల పై ప్రత్యేక నిఘా ఉంచారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో నిఘాకట్టుదిట్టం చేశారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం సరఫరాను అడ్డుకునేందుకు ఎన్నికల కమిషనర్ ఆదేశానుసారం తనిఖీలు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండల కేంద్రంలోని మల్లూరు గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రోజు జిల్లా పరిషత్ పాఠశాల ముందు నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. అంతర్ రాష్ట్రాలైన మహారాష్ట్ర నుండి మల్ల యోధులు కుస్తీ పోటీలలో హెూరాహెూరీగా తలపడ్డారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటల నుండి 50 రూపాయల తో ప్రారంభమైన కుస్తీ పోటీలు మల్ల యోధులు నువ్వా నేనా అనే విధంగా తలపడ్డారు. చివరి కుస్తీ 6.30 గంటలకు ఐదు తులాల వెండి కడెం అలాగే 2000 రూపాయల నగదుతో ముగిసిందని నిర్వాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుదిమే శ్రీనివాస్, బింగి శేఖర్, పెద్ది హనుమాన్లు, ఒంటరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు కాంగ్రెస్ అండ

- ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తాం
- చేరికల సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- కొత్త, పాత వారు కలిసి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని పిలుపు

నవతెలంగాణ-లింగంపేట్/కామారెడ్డి/దోమకొండ/నసురుల్లాబాద్



కామారెడ్డి : కాంగ్రెస్‌లోకి చేరుతున్న వారికి స్వాగతం పలుకుతున్న షబ్బీర్, షెట్కార్... లింగంపేట్ : ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందని, లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన తాజా మాజీ సర్పంచులు బి ఆర్ ఎస్ పార్టీని రాజీనామా చేసి ఆదివారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. లింగంపేట్ మండలంలోని సజ్జన పల్లె మాజీ సర్పంచ్ పుట్టి పోచయ్య, మాజీ వార్డు సభ్యులు ఎక్కపల్లి మాలవత్ సంగ్య నాయక్ తండ మాజీ సర్పంచ్ బన్ని సక్రు పలువురు నాయకులు ఆదివారం ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు పార్టీ ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జజాల సురేందర్ ప్రధాన అనుచరులు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రోజురోజుకు కారు పార్టీ ఖాళీ అయిపోతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వైపు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ హరిజనులకు గిరిజనులకు అండగా ఉంటుందన్నారు. జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ మాజీ ఎంపీపీ ఆసియా మోహిద్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా నియోజకవర్గంలోని గతంలో వివిధ పార్టీ నుండి ఎమ్మెల్యేలగా పోటీ చేసిన అభ్యర్థులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బిజెపి నుండి కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ ఇట్టెం సిద్ధరాములు, గతంలో బిఎల్ఎఫ్ పార్టీ కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి గా డాక్టర్ పుట్ట మల్లికార్జున్ లు పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాలు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షట్కార్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసేదే చెబుతుంది, చెప్పింది తప్పనిసరి చేస్తుందన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ మాట మీద నిలబడుతుంది ఇచ్చిన వాగ్దానంపై కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి నాయకులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికలో ఇచ్చిన ఆరు వాగ్దానాల్లో ఐదు నెరవేర్చాము అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పాతవారు, కొత్తగా చేరిన వారు కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షట్కార్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దోమకొండ : దోమకొండ మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ , కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ సెట్కార్ సమక్షంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శంకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నల్లపు శ్రీనివాస్, కో ఆప్షన్ మెంబర్ షమీ, పట్టణాధ్యక్షుడు నయీమ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాల్ నర్సు తో పాటు పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరుమల్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నర్సారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మాజీ సి డి సి చైర్మన్ నరసయ్య బత్తిని సిద్ధ రాములు, సీతారాం మధు,సంతోష్ రెడ్డి,పిస్నెం నాగేంద్ర వర్మ కోషన్స్ సభ్యులు శమీ, తదితరులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి ఆహ్వానం

నసురుల్లాబాద్ : నసురుల్లాబాద్ మండలం బొప్పాస్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల ప్రెసిడెంట్ బలరాం సింగ్ నివాసానికి ఏనుగు రవీందర్ రెడ్డి చేరుకొని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా పాలనలో అమలు చేస్తున్న పథకాలను చూసి అభివృద్ధి లో భాగస్వామ్యం అయ్యేందుకు పార్టీ లో చేరుతున్నట్టు బలరాం సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నసురుల్లాబాద్ మండల పార్టీ అధ్యక్షులు నందు టీపీసీసీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు ప్రతాప్ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తకొండ భాస్కర్ మాజీ ఎంపీపీ బజ్జ నాయక్, నరేష్ రాథోడ్, గణేష్ తదితరులు ఉన్నారు.


బలరాంసింగ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

మేడే వేడుకలు విజయవంతం చేయాలి

- సీఐటీయూ నాయకులు ఖలీల్


మాట్లాడుతున్న ఖలీల్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మేడే వేడుకలను డివిజన్ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు ఖలీల్ పిలుపునిచ్చారు. ఆదివారం బాన్సువాడ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం లాల్ జెండా పోరాటాన్ని గుర్తు చేసుకునే రోజు మేడే అన్నారు. బుధవారం జరగబోయే 138వ ప్రపంచ కార్మిక దినోత్సవంగా మే డేను డివిజన్ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, అభిమానులు ప్రతి గ్రామంలో హాజరై జెండాలను ఎగురవేసి పండగ వాతావరణాన్ని సృష్టించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 44 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజన చేసి కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరూ ఏకమై పోరాటం చేసి ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చి పోరాటాల ద్వారా నాలుగు కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు బుజ్జి, సాయిలు, మేతరాజు, విఠల్, పెరక శివరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి వైకుంఠ రథం వితరణ


వైకుంఠరథం అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావు పెట్ సామల రాజేశ్వర్‌రెడ్డి (ఎన్ఆర్ఐ) సుమారు రూ.2.50 లక్షలతో గ్రామానికి వైకుంఠ రథం వితరణ చేశారు. గ్రామ బిఆర్ఎస్ నాయకుడు సామల జనార్ధన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డిల తండ్రి కీ.శే. సామల ఆశన్న జ్ఞాపకార్థం వితరణ చేసినట్లు తెలిపారు. ఆదివారం విడీసీ అధ్యక్షుడు ఏనుగు బాల్‌రాజ్‌రెడ్డి, సామల జనార్ధన్‌రెడ్డి, గ్రామస్తులు, గ్రామ పంచాయతీకి అప్పగించారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు మేడిపల్లిలో కుస్తీ పోటీలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామంలో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నలుమూల ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర జిల్లాల నుంచి మల్లయోధులు పాల్గొని కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.

బీబీపాటిల్‌తో అభివృద్ధి శూన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పి ప్రజలకు ఓట్లు అడగాలని బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌కు కాంగ్రెస్ నాయకులు సూచించారు. బీబీపాటిల్‌తో అభివృద్ధి శూన్యమని అన్నారు. దోమకొండ మండల కేంద్రం లో ఆదివారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రము లో గత 10 సంవత్సరాలుగా అభివృద్ధికి ప్రజలకు ప్రజా సమస్యల మీద స్పందించని వ్యక్తి బీబీ పాటిల్ అన్నారు. అధికారం కోసం బిజెపి పార్టీ లో చేరి మళ్లీ ప్రజలను మభ్యపెట్టడానికి పార్టీ మారి ఎంపీగా పోటీగా వస్తున్నారని ఎద్దేవా చేశారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, సి డి సి మాజీ చైర్మన్ ఐరన్ నరసయ్య, కోపరేటివ్ చైర్మన్ మాజీ చైర్మన్ రావులపల్లి నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మాజీ జిల్లా కమిటీ రైతుబంధు డైరెక్టర్ అండం శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుపై హర్షం


ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్రంలోని చెరువులు, సొసైటీలలో నూతన సభ్యత్వాల విషయంలో ముదిరాజ్, బెస్త కులాల మధ్య గతకొన్ని ఏండ్లుగా నెలకొన్న ప్రతిష్టంబనపై రాష్ట్ర హైకోర్టు సమగ్రంగా విచారించి ముదిరాజ్‌లకు సైతం సభ్యత్వాలు కల్పించాలని తీర్పు ఇచ్చినట్టు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం లింగంపేట మండల కేంద్రంలో అయ్యపల్లి గ్రామంలో పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైకోర్టు లాయర్ డీ ఎల్ పాండు ముదిరాజ్ కృషి పట్లా ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో నూతన సొసైటీలు, నూతన సభ్యత్వాలు విషయం లో ప్రతిస్థంభన తొలగిపోనుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు తూర్పు రాజు ముదిరాజ్, మండల అధ్యక్షులు సాయి కుమార్ బొల్లారం సాయిలు రాజారాం బాలయ్య, అశోక్ ఈర్ల శ్రీనివాస్, బోండ్ల కిష్టయ్య ముదిరాజ్, రెడ్డి రాజులు ముదిరాజ్, స్వామి ముదిరాజ్, నగర్ దేవేందర్ ముదిరాజ్, పోల్కంపేట సిద్దయ్య ముదిరాజ్, సంద్య బాలయ్య ముదిరాజ్ పరువయ్య కిషన్, తదితరులు ఉన్నారు.

రాజ్యాంగంతోనే వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్

ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు

నవతెలంగాణ-మద్నూర్


జెండా ఆవిష్కరించి అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారానే వెనకబడిన వర్గాలు రిజర్వేషన్లు పొంది ఆర్థిక సామజిక అభివృద్ధి చెందుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న ఎక్లార, అవల్గావ్, గ్రామాలలో "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేసి రాజ్యాంగంలో మార్పులు చేయాలని కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు రూపంలో వారికి తగిన బుద్ధి చెప్పి బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజు, ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసారాలకు, ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుండి ముందస్తుగా అనుమతి పొందిన వాటినే ప్రసారం, ముద్రణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛానళ్లలో ప్రసారాలకు, ప్రింట్ మీడియా లో ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందకుండా ప్రచురించడం, ప్రసారం చేయడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కు వస్తుందని, అట్టి ఖర్చును అభ్యర్థి పేర చూపించనున్నట్టు తెలిపారు. అభ్యర్థి పేర వారి అనుచరులు ఖర్చు చేసినా అట్టి ఖర్చు అభ్యర్థి ఖాతాలో చూయిస్తామని, ఒక వేళ అభ్యర్థి సమ్మతించకుంటే పబ్లిషర్ పై చర్య తీసుకోనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రకటనలకు సంబంధించిన స్క్రిప్ట్, వీడియో, ఖర్చు, తదితర వివరాలను నిర్ణీత దరఖాస్తు ఫారం వెంట సమర్పించాలని, వాటిని పరిశీలించి ఎం.సి.ఎం.సి. కమిటీ ఆమోదం తెలుపుతుందని తెలిపారు. సామాజిక మాధ్యమాలలో బల్క్ ఎస్.ఎం.ఎస్. లు, వాయిస్ మెసేజిలు, సినిమా హాళ్లలో , రేడియోలలో ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందాలని సూచించారు. నిబంధనలననుసరించి ఎన్నికల కర పత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించే టప్పుడు తప్పని సరిగా అనుమతి పొందాలని సూచించారు. వాటిపై ప్రింటర్, ప్రచురణ కర్త పేరు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్, ప్రతుల సంఖ్య తో పాటు ప్రింటింగ్ చార్జీల వివరాలను , ముద్రితమైన ప్రచార సామగ్రి, పబ్లిషర్ ఇచ్చిన డిక్లరేషన్ కాపీని సమర్పించాలని పేర్కొన్నారు.

అసత్య వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వచ్చిన మెస్సేజ్ లో వాస్తవం గ్రహించి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కు 2 రోజుల ముందు సైలెన్స్ పీరియడ్ చాలా కీలకమని న్యూస్ రిపోర్టింగ్ లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో నిర్దిష్టంగా పేర్కొన్నారని, ఆ మేరకు నడుచుకోవాలని పేర్కొన్నారు. సభలు, సమా వేశాలకు, లౌడ్ స్పీకర్ లకు, వాహనాలకు ముందస్తుగా అనుమతి పొందాలని సూచించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం నిరంతరం పర్యవేక్షిస్తుందని, సి - విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, పేరు గోప్యంగా ఉంచనున్నట్టు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏదేని సమాచారం కొరకు 1950 కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

నవతెలంగాణ-లింగంపేట్


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. లింగంపేట ప్రధాన వీధులతో పాటు ఎక్కపల్లి, ఎక్క పల్లి తాండ, బానాపూర్, బాణాపూర్ తాండ, గిరిజన తండాల్లో కాంగ్రెస్ నాయకులు ఓటర్ల వద్దకు వెళ్లి తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వేసి గెలిపించాలన్నారు. అనంతరం రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆర్గారింటల పథకాల కరపాత్రాలను ఓటర్లకు అందించారు. ఈ ప్రచారంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బండి రాజయ్య, రామ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పద్మ నాగరాజు, రాజయ్య, మంజరి, ఎల్లమ్మయ్య, దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మద్దికుంట రోడ్డు మరమ్మతు చేయండి


తారు కొట్టుకుపోవడంతో గుంతలమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట- ఇస్సన్నపల్లె, మద్దికుంట నుండి మద్రి వరకు తారు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ రోడ్డు గుండా జిల్లాలో ప్రముఖ దేవాలయం శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి ప్రతిరోజు వాహనాల్లో వందల మంది భక్తులు వస్తుంటారు. గ్రామంలో 3000 మందికి పైన జనాభ ఉంటుంది. జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గ్రామ ప్రజలు ప్రతి పనికి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వెళ్తుంటారు. బీటి రోడ్డు పూర్తిగా తొలగిపోయి, గుంతలు, కంకర తేలడంతో ప్రయాణికులకు, భక్తులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ప్రయాణికులు వాహనాలు అదుపుతప్పి అనేక ప్రమాదాలు జరిగాయి. ప్రజల, భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తును చేపట్టాలని భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు గుండా ఏర్పడిన గుంతలు

నవతెలంగాణ
నిజామాబాద్
4
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కారుణ్య గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ప్రతిరోజు ఆలయంలో ఉదయం సాయంకాలం కుంకుమార్చన ఆటపాటలతో మహిళలు సందడి చేస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 30న కార్యక్రమాలు ముగుస్తాయని నటరాజ్‌గౌడ్, చంద్రగౌడ్, మల్ల గౌడ్, నాగ గౌడ్, గౌడ సంఘం పెద్దలు యువకులు తెలిపారు.


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

జీవన్‌రెడ్డికి అమూల్యమైన ఓటు వేసి గెలిపించుకుందాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఆయన గెలుపునకు కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహించారు. జీవన్‌రెడ్డికి తమ అమూల్యమైన ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు ఇచ్చిన 6 గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్, తానాకలాన్ పాల్దా భాస్కర్‌రెడ్డి, మంగల్‌పాడ్ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, చేపూర్ శ్రీనివాస్ గౌడ్, రంజిత్‌గౌడ్, బుడ్డ పోశెట్టి నాయకులు కార్యకర్తలున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించి, విద్య బుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదివిన నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగి, సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, చౌట్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాపరెడ్డి, కోనాపూర్ సింగిల్ విండో కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

- పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు


మోహన్‌దాస్ దంపతులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

విధి నిర్వహణలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు అన్నారు. జడ్పిహెచ్ఎస్ రామ్ మందిర్ పాఠశాల పిఇటి, పిఆర్టియు స్టేట్ అసోసియేట్ అధ్యక్షులు మేక మోహన్ దాస్ ఉద్యోగ విరమణ సభను ఆదివారం పట్టణంలోని మామిడిపల్లి రెడ్డి ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా టెన్నిస్ బాల్, క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా మోహన్‌దాస్ చేసిన సేవలు సహచరులకు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ అతిథులుగా జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మండల అధ్యక్షులు ఇట్టం గోపాల్, డివిజన్ ఇంచార్జ్ లక్ష్మణ్, స్టేట్ అసోసియేట్ అధ్యక్షులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చలం అర్బన్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సంగం అశోక్, ఆలూర్ అధ్యక్షులు అశ్వక్ హైమద్, ప్రధాన కార్యదర్శి సాద సంతోష్ స్టేట్ అసోసియేట్ గంగాధర్, మాక్లూర్ ప్రధాన కార్యదర్శి చిలుక శ్రీనివాస్, నందిపేట్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, టీజీ పేట జిల్లా అధ్యక్షులు బద్దం గోపిరెడ్డి, విద్యాసాగర్‌రావు, బి.నాగేష్, గటాడి రాజేష్, పింజ సురేందర్, గంగా మోహన్, సదామస్తుల రమణ, రాజ్‌కుమార్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు నిధులు డ్రా.. నేడు అమలు


మున్సిపల్ కార్యాలయం ఎదుట స్వర్గరథం

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో స్వర్గ రథం కోసం రెండు లక్షల 50 వేల రూపాయలు నిధులు ఖర్చు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ఆదేశాల మేరకు 2023 ఏప్రిల్ నెలలో మున్సిపల్ పాలకవర్గం నిధులు డ్రా చేసినట్లు సమాచారం. కానీ మొన్నటి (రెండు రోజుల ముందు) వరకు డ్రా చేసిన నిధులతో స్వర్గ రథం మాత్రం తేలేకపోయారని ఇటీవల భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన యువకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ ఆ విషయాన్ని భీంగల్ మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ పాలకవర్గం అధికారులు స్వర్గరథాన్ని తీసుకువచ్చి మున్సిపల్ కార్యాలయం ముందు నిలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రారంభించలేకపోయామని వారు తెలిపారు. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా తనకు ఏ విషయం తెలియదని తాను ప్రస్తుతం వరంగల్‌లో ఉన్నానని పొంతనలేని సమాధానం ఇచ్చి దాటవేసే ధోరణి ప్రదర్శించారు. ప్రభుత్వ నిధులను వెంటనే ఖర్చు చేయాలని నిబంధన ఉన్నా.. నిధులను డ్రా చేసి సంవత్సరం వరకు స్వర్గ రథం ఎందుకు తీసుకురాలేకపోయారని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ పాలనలో కష్టాలు, కన్నీళ్లే మిగిలాయి

- కేంద్రంలో అధికారంలో ఉన్నా అరవింద్ పసుపు బోర్డు తేలే
- ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఏనాడు మంచి చెడులకు రాలే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్ళే మిగిలాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. అడ్రస్, ఆఫీస్‌లేని పసుపు బోర్డు ఎక్కడా? అరవింద్ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బిజేపీలు హామీల అమలులో విఫలమయ్యాయన్నారు. హామీల అమలు కోసం మీ పక్షాన నిలబడి ప్రశ్నించే బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఆదివారం వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో కార్నర్ మీటింగ్‌లో నిజామాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్యసభ సభ్యులు సురేష్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక అలవి కానీ హామీలు ఇచ్చి, ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ 5 నెలల పాలనలోనే ప్రజలకు కష్టాలు కన్నీళ్లు మిగిలాయని అన్నారు. మాది ప్రజాపాలన, మార్పు కోసం అంటూనే కరెంట్ కోతల్లో, తాగు, సాగునీరు అందించడంలో కాలిపోతున్న మోటార్లతో అనేక అంశాలలో కాంగ్రెస్ మార్పులు తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 100 రోజుల గడువు దాటి 140 రోజులు అయినా ఎందుకు హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల సమయంలోనే ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్, ఎన్నికలు అయిపోయాక పట్టించుకోరని అన్నారు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలా? రైతన్నలు, ప్రజలు, మహిళలు, యువత ఆలోచించాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అప్పుడే ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న భయం వారికి కలుగుతదని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న పసుపు బోర్డు తేలే..

5 రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని మాటిచ్చిన అరవింద్ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి పసుపు బోర్డు తేలేదన్నారు. అలాంటి వ్యక్తికి ఈ ఎన్నికల్లో ఎందుకు ఓట్లు వేయాలో ఆలోచన చేయాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఇప్పుడేమో పసుపు బోర్డు సాధించానని చెబుతున్న అరవింద్, పసుపు బోర్డు సాధిస్తే ఆఫీస్ మెయిన్ దర్వాజ ఎక్కడ? ఆఫీస్ ఎక్కడ? ఆ ఆఫీస్‌లో నీకుర్చీ లేదా నా కుర్చీ చూపిస్తావా అని ప్రశ్నించారు. పసుపు పంట భారీగా సాగు తగ్గడం వల్లనే ధర ఈసారి పెరిగిందని, ఇందులో బీజేపీ ఘనకార్యం ఏమి లేదన్నారు. అరవింద్ ఎంపీగా ఉన్న 5 ఏండ్లలో అభివృద్ధి పనులకు ఏ గ్రామానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.

ఎమ్మెల్సీగా ఉన్న ఈ ప్రాంత ప్రజల మంచి చెడులకు రాలే..

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థుల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఏ నాడు ఇక్కడ ప్రాంత ప్రజల మంచి చెడుకు రాలేదన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ 40ఏండ్లుగా రాజకీయ జీవితంలో 20ఏండ్లు ఎమ్మెల్యేగా ప్రజల మధ్యనే ఉన్నాడన్నారు. ఎప్పుడు ఎవరికి ఎం అవసరం వచ్చిన ముందుంటాడు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా చేసిన అనుభవం కూడా ఉందని తెలిపారు. ఈ ఎంపీ ఎన్నికలు మీ కోసం వచ్చాయి.. కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఇచ్చిన హామీలు అమలు చేయాలి లేకుంటే ప్రజలు తిరస్కరిస్తారు అనే భయం వారిలో కలగాలన్నారు. మీ ఓటును బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డికి వేసి నాకు తోడుగా ఆయనను ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్, బిజెపి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరపున ఇద్దరం పోరాడుతామని ఎమ్మెల్యే అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఈ ప్రాంతం కేసీఆర్ వెంట నడిచింది.. రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి

రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఈ ప్రాంతం కేసీఆర్ వెంట నడిచిందన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా వచ్చిన తెలంగాణను అనేక రంగాల్లో దేశంలో అగ్రగామిగా ఉంచాడని, దేశంలో ఎక్కడికి వెళ్లిన తెలంగాణ గురించి గొప్పగా చెబుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 5 నెలల్లోనే మళ్ళీ తెలంగాణ ఆత్మ గౌరవాన్ని మంట గలుపుతుందన్నారు. కేసీఆర్‌కు తెలంగాణపై ఉన్న ప్రేమ కాంగ్రెస్, బిజేపీకి లేదన్నారు. తాను పార్లమెంట్‌లో పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రశ్నిస్తే, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అలాంటి ఆలోచన లేదని సమాధానం ఇచ్చారని తెలిపారు. అందుకే నేను పసుపు బోర్డుపై ప్రైవేట్ బిల్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టానన్నారు. తెలంగాణ ఆత్మ గౌరవం నిలబడాలంటే ఈ ఎన్నికలో కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులను ఓడించాలన్నారు. బాజిరెడ్డిని ఎంపీగా గెలిపిస్తే నేను రాజ్యసభలో, బాజిరెడ్డి లోకసభలో తెలంగాణ సమస్యలపై మీ పక్షాన పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'పచ్చలనడ్కుడ' చాలా ఇష్టం

- ఈ గ్రామానికి నాకు పూర్వ సంబంధం ఉంది
- బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పచ్చలనడ్కుడ గ్రామం అంటే నాకు చాలా ఇష్టమని, ఈ గ్రామానికి నాకు పూర్వ సంబంధం ఉందని బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జాన్కంపేట్ నుంచి పచ్చలనడ్కుడకు తాగునీరు అందించేందుకు కృషి చేశానని తెలిపారు. గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కంటే, డబల్ ఇస్తా అంటేనే ప్రజలు మోసపోయి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారన్నారు. ఆదివారం వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎంపీ కేఆర్ సురేష్‌రెడ్డితో కలిసి ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. పచ్చలనడ్కుడ గ్రామం అంటే నాకు చాలా ఇష్టం, ఈ గ్రామానికి నాకు పూర్వ సంబంధం ఉంది, ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జాన్కంపేట్ నుంచి పచ్చలనడ్కుడకు తాగునీరు అందించానని తెలిపారు. స్థానికంగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి, కేసిఆర్‌కు అత్యంత సన్నిహితుడు, బాల్కొండ ప్రాంతానికి అనేక నిధులు తీసుకొచ్చి అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందు ఉంచారన్నారు. ఇంకా చేయడానికి ఎక్కడైనా మిగిలి ఉందా అంటే ఏమీ లేదని పేర్కొన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కొట్లాడి తెలంగాణ తీసుకొచ్చి, పదేళ్ల తెలంగాణ పచ్చగా కళకళలాడేగా మార్చాడన్నారు. అన్ని విధాలుగా ప్రజలకు సౌకర్యాలు కల్పించారని తెలిపారు. కానీ మొన్న జరిగిన అసెంబ్లీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ, జుట కోర్ రేవంత్‌రెడ్డి అబద్ధపు మాటలు చెప్పి, బిఆర్ఎస్ పార్టీ కంటే సంక్షేమ పథకాలపై డబల్ ఇస్తానని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలను మోసం చేసి ఓట్లను దండుకొని గద్దెనెక్కిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఆయన వ్యాఖ్యానించారు.

మళ్లీ అదే ధోరణితో గ్రామాల్లోకి మాయమాటలు చెప్పడానికి కాంగ్రెస్, బిజెపి నాయకులు వస్తున్నారని వారిని నిలదీయాలన్నారు. ఎలక్షన్‌లో ఇస్తానన్న 4వేల పింఛన్, రుణమాఫీ, తులం బంగారం, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, రైతుబంధు, రైతు బీమా ఎక్కడని ఎక్కడికక్కడ నిలదీసి అడుగుతే సమాధానం చెప్పలేక పారిపోతారన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీకి వచ్చే నెల 13వ తేదీన ఎలక్షన్‌లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గెలిచిన తర్వాత పార్లమెంటు సమయంలో ఢిల్లీలో ఉంటా, పార్లమెంట్ అవ్వగానే పచ్చల నడుకుడ గ్రామం లాంటి గ్రామాల్లో ఉంటానని తెలిపారు. ఆశీర్వదించండి సేవకుల్లా పనిచేస్తాన్నారు. బిజెపి, కాంగ్రెస్ మోసపూరిత మాటలు వాగ్దానాలు నమ్మి మళ్ళీ మోసపోవద్దని ఆయన ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి


కాంగ్రెస్‌లో చేరుతున్న ఈగ గంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చరారు. ఈగ గంగారెడ్డితో పాటు కొంతమంది బీఆర్ఎస్ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. బోర్గం (పి) నిజామాబాద్ రూరల్‌లోని పెద్ద గ్రామమని తెలిపారు. దీనిని కార్పొరేషన్‌లో కలపకుండా చాలా కష్టపడ్డానని, కోర్టు వరకు వెళ్లాలని కానీ అనేక కారణాల వల్ల ఇది కార్పొరేషన్‌లో కలిసి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని అన్నారు. అలాగే పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు పార్లమెంట్‌లో కొట్లాడి దీని స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేసే విధంగా చూస్తానని అన్నారు. అలాగే బోధన్ బీదర్ లైన్ కూడా ఏర్పాటు చేస్తానని వివరించారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నగేష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, టిపిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మోపాల్ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, సందగిరి భూమ్ రెడ్డి, ఈగ రమేష్‌రెడ్డి, సడక్ శేఖర్‌రెడ్డి, విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంటగలుస్తున్న మానవ సంబంధాలు



- తరచూ హత్యలకు పాల్పడుతున్న వైనం
- ఇటీవలే కలకలం రేపిన రెండు హత్యలు

నవతెలంగాణ-ఆర్మూర్

బంధాలు, అనుబంధాలు, నమ్మకాలకు నూకలు చెల్లిపోతున్నవి. క్షణికావేశం, మద్యం మత్తు, డబ్బు వ్యామోహంతో దారుణాలకు ఒడిగడుతున్న ఘటనలు నేటి సమాజంలో సర్వసాధారణమైపోయాయి. భూ తగాదాలు, వివాహేతర సంబంధాలు, ఆస్తుల కోసం అయిన వారిని, నమ్మిన వారిని హతమారుస్తున్న ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నవి. తాజాగా ఒక్కరోజు గడవక ముందే భార్యల చేతుల్లో ఇద్దరు భర్తలు హత్యకు గురవడంతో ఉమ్మడి జిల్లాల్లో ఈ విషయం చర్చనీయాంశమైంది.

జిల్లా కేంద్రానికి దగ్గర గల కులాస్‌పూర్ గ్రామంలో సాయిరెడ్డి అనే వ్యక్తిని అతని భార్య రాధా హత్య చేయగా.. మోపాల్ మండలంలోని న్యాల్కల్ గ్రామంలో లక్ష్మి తన భర్త బోదాస్ లక్ష్మణ్‌ను బండరాయితో కొట్టి హత్య చేసింది.

ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, వివాహేతర సంబంధాలు..

ఉమ్మడి జిల్లాలలో చాలావరకు వ్యవసాయ భూములకు సంబంధించిన వివాదాలు జిల్లా కేంద్రంతో పాటు బోధన్, ఆర్మూర్ మండలాల పరిధిలో భూ తగాదాలతో, కుటుంబీకుల మధ్యనే కాకుండా ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగి హత్యలకు దారితీసిన ఘటనలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో అన్నదమ్ములు, తండ్రి కొడుకులకు సంబంధించిన భూవివాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలలో వివాహేతర సంబంధాల హత్యలు సైతం ఆందోళన కలిగిస్తున్నవి. జీవితాంతం కలిసి ఉంటానంటూ పెళ్లి చేసుకున్న భార్య భర్తలు ఒకరిపై ఒకరు అనుమానం, అక్రమ సంబంధాలతో కట్టుకున్న వారిని కడతేరుస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద మండలం దౌల్తాపూర్ శివారులో గత సంవత్సరం హనుమ బోయిని అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. తన అక్రమ సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని కారణంతో భార్య అనురాధ ప్రియుడు పోషబోయినితో కలిసి హత్య చేశాడు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో రమేష్ అనే వ్యక్తి భార్య ప్రియుడితో కలిసి హతమార్చింది. నాగిరెడ్డిపేట్‌లో వివాహేతర సంబంధం ఎక్కడ బయటపడుతుందోనని బాలుడిని చంపేశారు. బీర్కూర్‌లో భార్యను భర్త అనుమానంతో హతమార్చాడు. కామారెడ్డిలో భార్య తన తల్లిదండ్రులతో కలిసి భర్తను హత్య చేయించింది. ఇలా పలు కారణాల వల్ల వరుస హత్యలు తీవ్ర కలవరం రేపుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఆరు హత్యల ఘటన..

నియోజకవర్గంలోని మాక్లూర్‌లో ఆస్తిపై కన్నేసిన ప్రశాంత్, అతని స్నేహితుడైన ప్రసాద్ కుటుంబం మొత్తం ఆరుగురిని హతమార్చిన ఘటన ఉమ్మడి జిల్లా ప్రజలను కలచి వేసింది. స్నేహితుడే నమ్మక ద్రోహం చేయడం, చిన్నపిల్లలు, ఆడవారు అని చూడకుండా దారుణ హత్యలకు పాల్పడిన నిందితుడు ప్రశాంత్‌కు, అతని తల్లి, సోదరుడు మరో ఇద్దరు యువకులు సహకారం అందించడంతో వీరంతా కటకటాల పాలయ్యారు నమ్మిన స్నేహితుడే ఆస్తికోసం కుటుంబ మొత్తాన్ని కడతేర్చడం తీవ్ర విషాదాన్ని నింపింది.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో గల మోగా గ్రామంలో ఆదివారం జరిగిన పెండ్లి శుభకార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెండ్లికి హాజరైన ఎమ్మెల్యేను కుటుంబ సభ్యులు సన్మానించి, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి




మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన పలువురు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన శేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. వీరికి పార్టీ కండువా కప్పి సునీల్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఓట్లు అడగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తక్కువరి దేవేందర్, పాలెపు నరసయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ

నవతెలంగాణ-మద్నూర్/పిట్లం

కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, దొంగ్లి, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, 8 మండల కేంద్రాలలో మేడే కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాల కార్మిక సంఘం సభ్యులందరూ గ్రామపంచాయతీ కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్ ఆశ కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు, ఆల్ హమాలి రంగాల కార్మికులు, ఆటో యూనియన్ కార్మికులు, బీడీ కార్మికులు, ప్రతి ఒక్కరూ మే 1న నిర్వహించే మేడే ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులకు 18 గంటల పని విధానాన్ని వ్యతిరేకంగా 8 గంటల పని విధానం కావాలని కార్మికులు సమ్మె చేస్తే యజమాన్యం పోలీసులతో జరిపిన దాడిలో అమరులై తమ రక్తాన్ని చిందించి పోరాడి కార్మికులు తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో ఉన్న కార్మికులు మే 1వ తేదీ మే డే ఉత్సవాలు జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

దేశంలో బీజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మిక వర్గంపై అనేక రకాల భారము మోపుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మికులకు పని గంటలు పెంచి సంఘం పెట్టుకొని హక్కులను కాల రాస్తుందని వాటిని తిప్పికొట్టేందుకు కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాల కార్మికులందరూ మే డే ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దూర విద్య
రెగ్యులర్ విద్యతో సమానం

- గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి



ఇండెక్షన్ ప్రోగ్రాంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దూర విద్య రెగ్యులర్ విద్యతో సమానంగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలోని డాక్టర్ బీఆర్ఏఓయు (డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ) రీజినల్ కోర్డినేషన్ సెంటర్‌లో ఆదివారం యుజి, పిజి మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండెక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. దూర విద్య ద్వారా విద్యను అభ్యసించేవారు శ్రద్ధగా చదివి మంచి ఉత్తీర్ణత శాతం పొందితే రెగ్యులర్ విద్యతో సమానంగా అన్ని ఉద్యోగాలకు సమాన అవకాశాలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.సి.సి. కోర్డినేటర్ రంజిత మాట్లాడుతూ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలనే ఆలోచనతో దూరవిద్యలో ప్రవేశం పొందినవారిని అభినందిస్తూ ఈ సంవత్సరం యుజి, పిజి కోర్సులలో సుమారు 1300 ప్రవేశాలు అయినట్టు తెలిపారు. మొత్తం యుజి, పిజి అన్ని సంవత్సరాలు కలిపి సుమారు 3500 మంది నిజామాబాద్ రీజనల్ కోర్డినేటర్ సెంటర్ (ఆర్సిసి) నుంచి దూర విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం నుండి పిజి అసైన్మెంట్ ఆన్లైన్ ద్వారా సబ్మిట్ చేయవలసి ఉంటుందని తెలిపారు. డాక్టర్ బిఆర్ఏఓయు కౌన్సెలర్లుగా ఉన్న డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ వేణుప్రసాద్, డాక్టర్ హజారే శ్రీనివాస్, అశోక్ రావు, ప్రవీణ్ రెడ్డి, పోశెట్టి, సయ్యద్ లైక్, ప్రవీణ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యుజి, పిజి కౌన్సిలర్లు, ఆర్సిసి సిబ్బంది రాధ, బిందు, ప్రమేసింగ్, ప్రియవర్ధన్, రజిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి
సురేష్ షెట్కార్‌ను గెలిపించాలి

- వీరశైవ లింగాయత్ జిల్లా కార్యదర్శి మల్లప్ప పటేల్



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-పిట్లం

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌నే గెలిపించాలని కామారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ కార్యదర్శి మల్లప్ప పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కంబాపూర్ గ్రామంలోని వీరశైవ లింగాయత్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేష్ షెట్కార్ 2009 లో నాటి ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డిని ఒప్పించి వీరశైవ లింగాయత్ లను బిసి కులాలలోకి మార్పించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. లింగాయత్‌లు బిసి లోకి మారటం వల్ల ఎంతోమంది రాజకీయ , విద్య పరంగా లబ్ధి పొందారన్నారు. జూక్కల్ నియోజకవర్గంలో లింగాయత్‌లకు జడ్పిటిసి , సర్పంచ్ , ఎంపీటీసీ , ఎంపీపీలుగా పదవులు వరించాయన్నారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెనువెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుకు సురేష్ షెట్కార్ కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెనువెంటనే మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, పది లక్షలతో ఆరోగ్యశ్రీ పథకం, 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని , ఆగస్టు 15 నాటికి 2 రెండు లక్షల రుణమాఫీని ఒకే విడతలో అందించనున్నట్టు తెలిపారు. అందుకుగాను ప్రతి ఒక్క వీరశైవ లింగాయత్ లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సురేష్ షెట్కార్ నే గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ నాయకులు హనుమండ్లు పటేల్ , మందారపు నాగప్ప , లింగప్ప , హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల
ఫీజుల దోపిడీ అరికట్టాలి

- పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నామాల అజాద్

తెలంగాణ రాష్ట్రంలో 2024-2025 విద్య సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్‌ల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వకముందే ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టి, ఆ విద్యాసంస్థల గుర్తింపులు రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కామారెడ్డి పిడిఎస్‌యు జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు సంబంధిత విద్యాశాఖ అధికారుల అండదండలతో విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియకు పర్మిషన్ ఇవ్వకముందే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు రాష్ట్రంలోని వివిధ నగరాల్లోని ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగ్‌లు నెలకొల్పుకొని ఫ్లెక్సీలతో ప్రచారం నిర్వహిస్తూ, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతూ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మాయ మాటలు చెబుతూ లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో దోచుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో పిడిఎస్‌యు అధ్యక్షులు జీ.సురేష్, ఉపాధ్యక్షులు సరీచంద్, జిల్లా నాయకులు నవీన్, సుశీల్, మహేష్, రామ్దాస్, బాలాజీ, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన బస్టాండ్

- మహిళల ఫ్రీజర్నీకి ఇబ్బందులు



బస్సులో సీటు ఆపుకొనేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ప్రధాన బస్టాండ్‌లో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ఆదివారం వివిధ రకాల ఫంక్షన్‌లు ఎక్కువగా ఉండటంతో పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మహిళ ప్రయాణికుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉన్న ప్రయాణికులు సంబంధిత ప్రాంతానికి వెళ్లే బస్సు రాగానే సీటు ఆపుకొనేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో చిన్నపాటి గొడవలు సైతం చోటుచేసుకుంటున్నాయి.



బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పట్టణంలో స్వచ్ఛ కాలనీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం 43వ వారం ఉత్సాహంగా నిర్వహించారు. గత 43 వారాలుగా ప్రతి ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలోని ఏదో ఒక ప్రాంతంలో స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు కలిసి రోడ్డు నెంబర్ 1లో ఉత్సాహంగా శ్రమదానం చేశారు. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన చెట్ల కొమ్మలను కట్టర్‌తో కత్తిరించారు. రోడ్డు పక్కనున్న ముళ్ల పొదలను తొలగించారు. వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని ఒకచోట కుప్పగా పోసి నిప్పంటించారు. ఇరిగేషన్ గార్డెన్ పరిసరాలను కూడ పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ 43 వారాలుగా ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కాలనీ వాసులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు చైతన్యవంతులై చెత్తను బయట పారేయకుండా మున్సిపల్ చెత్త బండిలో వేస్తున్నారని చెప్పారు. అందరి సహకారంతో జర్నలిస్ట్ కాలనీ స్వచ్ఛ కాలనీగా అవార్డు అందుకున్నామని ఆయన తెలిపారు. పార్టీలకు అతీతంగా నిధులు మంజూరు చేసి కాలనీలో జిమ్‌ను ఏర్పాటు చేయాలని, కల్వర్టులు, మురికి కాలువలు నిర్మించాలని అధికార, ప్రతిపక్ష నాయకులను కోరారు. కాలనీ కోశాధికారి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఒకటో నెంబర్ రోడ్డులో నిర్వహించిన స్వచ్ఛ కాలనీ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, కార్యదర్శులు రాజు, రాజ్ కుమార్, ఎర్ర భూమయ్య, ఎస్సారెస్పీ డిఇ గణేశ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని దాని మిత్రపక్షాలను ఓడించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

నియంతృత్వ కార్పోరేట్ సంపన్న ఫాసిస్టు బిజెపిని దాని మిత్రపక్షాలను ఓడించాలని యంసిపిఐయు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. ఆదివారం మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) ఎంసీపిఐయు కామారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ బండారి మహిపాల్గారి అధ్యక్షతన విజ్ఞాన బారతి కాలేజీ ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశం తొలుత ప్రజా ఉద్యమాల్లో మరణించిన కామ్రేడ్స్ అందరికీ, ఉక్రెయిన్, రష్యా దాడుల్లో, పాలస్తీనాపై ఇజ్రాయెల్ అక్రమ దాడుల్లో మరణించిన వారికి పాలకుల ప్రజావ్యతిరేక, రైతువ్యతిరేక విధానాల వలన ఆత్మహత్యలు చేసుకుని మరణించిన యువతకు, రైతులకు సమావేశం 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గాదగోని రవి మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో యంసిపిఐ(యు) పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వరంగల్, చేవెళ్ల, నల్గొండ, పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తున్నది అని పోటీలో ఉన్న అభ్యర్థులు పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు, రైతు, యువజన, విద్యార్థి సంఘాల రాష్ట్ర ప్రధాన బాధ్యతల్లో ఉండి ప్రజాపోరాటాల్లో ముందు పీటన నిలబడి పని చేస్తున్న నీతి నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన ప్రజాఉద్యమ కారులు అని అన్నారు. యంసిపిఐ(యు) భాగస్వామ్య బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థులు భువనగిరి లో, నిజామాబాద్, ఖమ్మం, మహబూబాబాద్‌లో పోటీ చేస్తున్నారు. వీరి విజయాన్ని కోరుతూ క్షేత్ర స్థాయిలో ప్రచారం జరుగుతోందని ప్రజలు ఆదరించి గెలిపించాలన్నారు. కేంద్రంలోని బిజెపి దానికి మద్దతు ఇస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. యావత్ ప్రభుత్వ రంగం ప్రైవేటు శక్తులకు దారాదత్తం చేస్తు అత్యంత కీలకమైన రక్షణ రంగంలో కూడా 4 సంవత్సరాల ఒప్పందం పేరుతో అగ్నిపథ్ సైనిక నియామకాలు చేపట్టడం, రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడిదారులకు పెట్టుబడులకు అనుమతులు ఇవ్వటం, విశాల రైల్వే రంగాన్ని కూడా ప్రైవేటీకరణ చేయడం, విమానయానం, నౌకాయానం, సముద్ర జలాంతర్గాములు సైతం ప్రైవేటు శక్తులకు దారాదత్తం చేయటం, ప్రకృతి సంపద అయిన అటవీ సంపదను మొత్తం ఆదాని అంబానీలకు కట్టబెట్టిన తీరు అందుకోసం దేశ ప్రజల ప్రయోజనాలను మొత్తం తాకట్టు పెట్టిందన్నారు.

వ్యవసాయ రంగంలో రైతు వ్యతిరేక చట్టాలను,44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడులుగా మార్చి కార్మిక, రైతు వ్యతిరేక కార్పొరేట్ సంపన్న వర్గాలకు దేశ సంపదను దారాదత్తం చేయటం ప్రశ్నించిన వారిపై దేశద్రోహం, రాజద్రోహం, ఉపా చట్టాలను పెట్టి, జైల్లో పెట్టడం, ప్రతి పక్షాలపై ఈడి, ఐటీ, సిబిఐ దాడులు చేసి జైళ్లలో పెట్టడం చేస్తుందన్నారు. సమావేశంలో యంసిపిఐయు జిల్లా కార్యదర్శి మాలోతు జబ్బర్ నాయక్ మాట్లాడుతూ.. 138వ ప్రపంచ కార్మిక పర్వదినం మే డెను గ్రామ గ్రామంలో పెద్ద ఎత్తున జరుపాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రమేష్, నర్సింలు, సుజాత, భార్గవి, స్వామి, శేఖర్ జిల్లా నాయకులు నరసరావు, నరసింహులు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని వంతెన సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యమైయినట్టు ఎస్ఐ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండల కేంద్రంలో గల వంతెన సమీపంలో పాడుబడ్డ బాయిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపివేసి గొనె సంచిలో కట్టి పైన ప్లాస్టిక్ సంచిలో కట్టి బాయిలో పడేసినట్టు తెలుస్తుంది. మహిళా శవం కుళ్లిన స్థితిలో ఉంది. గులాబీ రంగు చీర జాకెట్ ధరించి ఉంది. ఇట్టి మహిళ ఇటీవల మిస్ అయిన గాంధారికి చెందిన బుర్రి కీర్తన(19)గా అనుమానం కలదు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించమని గాంధారి ఎస్.ఐ ఆంజనేయులు తెలిపారు.

